క్లుప్తంగా

డ్రైనేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నిర్మాణం కోసం కాలువ తీసి అలాగే వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మహాలక్ష్మి

బద్వేలు అర్బన్ : వసతి గృహాల్లో విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మహాలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకోవడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని సూచించారు. అలాగే శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నాగదాసరి ప్రసాద్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మైదుకూరు : మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో రెండో రోజు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం ద్వారా సమాజానికి ఆక్సిజన్‌ను అందించగలరని అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు సుధీర్ రెడ్డి, చెన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పట్టించుకోని ప్రభుత్వం

పోరుమామిళ్ల : గత ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లు అర్ధంతరంగా నిలిచిపోయాయని వాటిని కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కంపచెట్లు పెరిగి కాలనీ అడవిలా తయారైందని మానవ హక్కుల సంఘం కార్యదర్శి ఫణిరావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సభ్యులు ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని కాలువకట్ట వద్ద జగనన్న కాలనీని మంగళవారం మానవ హక్కుల సంఘం నేతలు సందర్శించారు. 76 ఇళ్లున్న ఈ కాలనీకి రోడ్డు, విద్యుత్ సదుపాయం, నీటి సౌకర్యం కల్పించాలన్నారు.

చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించాలి

పోరుమామిళ్ల : కల్తీ మద్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించాలని పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీమద్యం ఫ్యాక్టరీలో రూ. కోట్ల విలువ చేసే కల్తీమద్యం దొరకడం అక్కడ పని చేస్తున్న బీహార్ కూలీలు పట్టుబడటం, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి, జనార్దనరావుకు, టీడీపీ పెద్దలకు లింకులు ఉన్నట్లు బహిర్గతం కావడంతో ముఖ్య నేతలు తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని హడలిపోతున్నారన్నారు. ప్రభుత్వంలోని పెద్దల బండారం బయట పడుతుందని నేరం ఇతరులపై వేసే కుట్ర జరుగుతోందన్నారు. కేసును పక్కదోవ పట్టించే కుట్రలను మానుకుని సీబీఐ విచారణకు సిద్ధం కావాలన్నారు.

మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు

పోరుమామిళ్ల : ప్రధాని మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని పీసీసీ సభ్యుడు అన్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మోడీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలన్నారు. ప్రత్యేక హోదా విషయం పక్కన పెట్టారని విమర్శించారు. ఎనిమిదేళ్లుగా జీఎస్టీ పేరుతో లక్షల కోట్లు సామాన్యులపై భారం వేసి, బీహార్ ఎన్నికల నేపథ్యంలో జీఎస్టీ తగ్గించామని చెప్పడం సిగ్గు చేటన్నారు.

మాయమవుతున్న రహదారులు!



ఎన్‌జీఓ కాలనీ రోడ్డులో కారు షెడ్ల నిర్మాణం



గాంధీరోడ్డు వీధిలో రోడ్డుపైనే పూలచెట్లు



రోడ్డుపై పాఠశాల బస్సులు నిల్పున్న దృశ్యం

- కలసపాడు, పోరుమామిళ్ల, బద్వేలులో రోడ్లపై ర్యాంపులు కట్టిన వైనం
- ఇరుకు సందులుగా మారుతున్న విశాలమైన రోడ్లు
- చోద్యం చూస్తున్న పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు

బద్వేలు : బద్వేలు పట్టణం నలువైపులా వేగంగా విస్తరిస్తోంది. అంతే వేగంగా విశాలమైన రోడ్లను దురాక్రమణ చేసి ఇరుకు సందులుగా మార్చేస్తున్నారు. పట్టణంలో గాంధీ నగర్, తెలుగు గంగ కాలనీ, బుల్లెట్ సుబ్బారెడ్డి వీధి, పోరుమామిళ్లలో ప్రధాన రహదారి, ఆర్యవైశ్య బజారు, పాత పోస్టాఫీస్ రోడ్డు, ఐఎల్ రెడ్డి బిల్డింగ్ రోడ్డు, కలసపాడులో గిద్దలూరు, పోరుమామిళ్ల ప్రధాన రహదారులతో పాటు పోలేరమ్మవీధిలో రోడ్లన్నీ దురాక్రమణకు గురయ్యాయి. 30, 40 అడుగుల వెడల్పున్న రోడ్లు ఇప్పుడు 15 అడుగులు కూడా లేకుండా ఆక్రమించేశారు.

బద్వేలులో తెలుగుగంగ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, పద్మావతి ఆసుపత్రి రోడ్డు తదితర కాలనీల్లో రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మాణం చేశారు. ఎన్‌జీఓ కాలనీలో కళ్లు చెదిరే విధంగా పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకుని కారు షెడ్లు, పూలతోటలు ఏర్పాటు చేసుకున్నారు.

అవసరాన్ని బట్టి ఆక్రమణలు..

ఒక్కొక్క వీధిలో వారి అవసరాన్ని బట్టి రోడ్లను ఆక్రమించుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గాంధీనగర్‌లో ఏకంగా రోడ్లను ఆక్రమించి ఇళ్లు కట్టేశారు. తెలుగు గంగ కాలనీలో ప్రతిఇంటి ముందు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసుకుని కార్లు తదితర వాహనాలు పార్క్ చేసుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు..

బద్వేలు పట్టణంతో పాటు పోరుమామిళ్ల, కలసపాడు పట్టణాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు దురాక్రమణలతో కుంచించుకుపోయాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

మూల మలుపుల వద్ద పొంచి ఉన్న ప్రమాదం..

నియోజకవర్గంలోని కలసపాడు, పోరుమామిళ్ల, బద్వేలు పట్టణాల్లో మూడు, నాలుగురోడ్ల కూడళ్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. కలసపాడులో వైఎస్‌ఆర్ సర్కిల్, పాత పోస్టాఫీస్, పీర్లచావిడి, తూర్పువీధి, శివాలయం వీధి, పోలేరమ్మచేను వీధులు, బద్వేలులో గాంధీనగర్, ఎన్‌జీఓ కాలనీ, తెలుగుగంగ, బుల్లెట్ సుబ్బారెడ్డి తదితర వీధుల్లో, పోరుమామిళ్లలో అంబేడ్కర్ సర్కిల్, గాంధీ బొమ్మ, బెస్తవీధి తదితర చోట్ల మూల మలుపుల దగ్గర వాహనచోదకులు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల దగ్గర ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

రోడ్ల దురాక్రమణ విషయమై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిని వివరణ కోరగా మున్సిపాలిటీలో పాతుకు పోయిన సమస్యలన్నిటినీ ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు జారీచేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షోకాజ్ నోటీసుకు వివరణ

ప్రొద్దుటూరు : రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి మంగళవారం అమరావతిలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను కలిశారు. పార్టీ ఏర్పాటు తర్వాత 2021–22, 2022–23, 2023–24, 2024–25 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ నివేదికలను సమర్పించలేదని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆర్‌ఆర్‌ఎస్ పార్టీకి నోటీసు ఇచ్చారు. ఈ మేరకు హాజరైన కుంచం వెంకటసుబ్బారెడ్డి అధికారులకు వివరణ ఇచ్చారు.

కంటి వైద్య పరీక్షలు

చాపాడు : మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆప్తామాలజీ ఆఫీసర్ గజ్జల చంద్రమౌళి హైస్కూల్‌లోని 120 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో ఇద్దరికి విటమిన్–ఏ లోపం ఉన్నట్లు, ఇదే క్రమంలో ఐదుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు ఆప్తామాలజీ అధికారి తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి జిల్లా అంధత్వ నివారణ సంఘం ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ ప్రసాద్, హెచ్‌ఎం గోపినాథ్, ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్‌తో రైతుకు ప్రోత్సాహం

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : ఇథనాల్ వినియోగాన్ని పెంచితే రైతులకు ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక రాజీవ్ సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్‌ను మంగళవారం కలెక్టర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్వాలిటీ, క్వాంటిటీలో ఎక్కడా రాజీ లేకుండా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ శాఖ నిర్వహణలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. రాయలసీమలో ఇది మూడవ రెవెన్యూ పెట్రోలు బంకు అని, జిల్లాలో మూడు పెట్రోలు బంకులు రెవెన్యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ప్రొద్దుటూరు పట్టణంలో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల నిర్వహణలో సేవలు అందించే పెట్రోలు బంకుల్లో స్వచ్ఛమైన, నాణ్యమైన, కచ్చితమైన కొలత పరిమాణంలో పెట్రోలు, డీజిల్ సరఫరా జరుగుతుందన్నారు. అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. తహసీల్దార్ గంగయ్య, భారత్ పెట్రోలియం లిమిటెడ్ టెర్రిటరీ మేనేజర్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్లు అజయ్‌బాబు, సుదర్శన్, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు మేనేజర్ తవ్వా వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోండి




భవన నిర్మాణ వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించిన నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎంపీడీ కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణానికి సంబంధించిన సిమెంట్, ఇటుకలు, టైల్స్ తదితర వాటిపై జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై గత 20 రోజులుగా ప్రజలందరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ప్రొద్దుటూరు, రాజుపాళెం ఎంపీడీఓలు సూర్యనారాయణరెడ్డి, రామనాథరెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాజా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి లబ్ధి

మైదుకూరు : జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని డ్వామా సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ రామలింగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీని తగ్గించిందన్నారు. దాని వల్ల ప్రతి కుటుంబానికి రూ.6వేలు నుంచి రూ.15వేలు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ స్పెషల్ ఆఫీసర్ చక్రానాయక్, మండల పరిషత్ ఏఓ నాగేంద్రబాబు, మున్సిపల్ మేనేజర్ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై అవగాహన



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ

గోపవరం : మండలంలోని రాచాయపేట రైతుసేవా కేంద్రంలో మంగళవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం కడప వారి ఆధ్వర్యంలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్య, శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి కోసం విచక్షణా రహితంగా పురుగు మందులు, ఎరువులు వాడుతున్నారని, వీటి వలన నేల నిస్సారమై నీటి, పర్యావరణ కాలుష్యం జరిగి అనేక అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు జీవన ఎరువులపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి, ఏఓ విజయరావు, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



కాశినాయన:సీపీఆర్ ఎలా చేయాలో వివరిస్తున్న డాక్టర్ కళ్యాణ చక్రవర్తి



ప్రొద్దుటూరు రూరల్:సీపీఆర్‌పై అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు, సిబ్బంది

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో సీపీఆర్(హృదయ శ్వాస పునరుద్ధరణ)పై అవగాహన కల్పించారు. సీపీఆర్ ద్వారా ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని మెదడు, ప్రాణధార అవయవాలకు పంపడం వలన బాధితుడు బతికే అవకాశాలు మెరుగుపరచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిర్మల, పీహెచ్‌ఎన్ శారద, హెచ్‌ఎస్ హుస్సేనమ్మ, వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సుబ్బరాయుడు, గౌరీలక్ష్మీ, పర్వీన్, గౌతమి, బేబీ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ : అత్యవసర సమయంలో సీపీఆర్ (హృదయ శ్వాస పునరుద్ధరణ)పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కిశోర్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ అవసరమైన సమయంలో బాధితుడిని గట్టిగా ఉన్న నేలపై పడుకోబెట్టి చేతులు ఒకదానిపై మరొకటి పెట్టి ఛాతి మధ్య భాగంలో నిమిషానికి కనీసం 20 నుంచి 30 సార్లు గట్టిగా నొక్కాలన్నారు. ప్రతి నొక్కుడు 5–6 సెంటీమీటర్ల లోతు వరకు ఉండాలన్నారు. ఇలా చేయడం వల్ల గుండె ఆగిపోయిన బాధితులను చాలా వరకు రక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, సీనియర్ అసిస్టెంట్ మధు, ఫార్మసిస్టు సురేంద్ర, స్టాఫ్‌నర్సులు సావిత్రి, అచ్చమ్మ, ల్యాబ్ టెక్నిషియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో మంగళవారం సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వైద్య సహాయం అందేంత వరకు ఇలా చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడగల వారమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హైమావతి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17న క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఈనెల 17న యువకులకు వాలీబాల్ టోర్నమెంట్, మహిళలకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25 ఏళ్లలోపు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966475742, 9154195061 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వీరభద్రస్వామికి రూ.20.02 లక్షల ఆదాయం

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మంగళవారం నిర్వహించిన టెంకాయల విక్రయం, తలనీలాల సేకరణ వేలం పాట ద్వారా స్వామి వారికి రూ.20.02లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ప్రొద్దుటూరు డివిజనల్ అధికారి కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో టెంకాయలు విక్రయించుకునేందుకు కడపకు చెందిన ఎం.వెంకటలక్ష్మి రూ.5.52 లక్షలకు వేలం దక్కించుకోగా, తలనీలాల సేకరణ కోసం బ్రహ్మంగారిమఠంకు చెందిన ఎస్.రాజేష్ రూ.14.50 లక్షలకు వేలం దక్కించుకున్నారు.

జీఎస్టీ సంబరాలు సిగ్గు చేటు

పోరుమామిళ్ల : ప్రజల వద్ద దోచుకుని జీఎస్టీ పేరుతో సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్జీయు భవన్‌లో మండల కార్యదర్శి రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రధానవక్తగా పాల్గొన్నారు. బద్వేలు ఏరియా నూతన కార్యదర్శిగా పిడుగు మస్తాన్ నియమితులైన సందర్భంగా మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ ఈనెల 16న మోదీ ప్రభుత్వం ఓర్వకల్లు వద్ద జీఎస్టీ సంబరాలు నిర్వహించాలనుకోవడం, కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేయడం, దానికి లక్షల రూపాయలు ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తిరుమల వెంకన్న స్వామి సన్నిధిలో చెప్పిన కడప ఉక్కు ఫ్యాక్టరీ, ప్రత్యేక ప్యాకేజీ, యువతకు ఉపాధి తదితర హామీలు విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, ఇమ్మానియేలు, కేశవ, సఫా, షాహిదా, వెంకటేశ్వర్లు, రఫీ, జాకోబ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లు ఐకమత్యంగా ముందుకు సాగాలి

బద్వేలు అర్బన్ : పాస్టర్లంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని, తద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ జీవన్‌కుమార్, అడ్వైజరీ బోర్డు మెంబర్ డాక్టర్ వై.ఎస్.థామస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గాడ్ మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ బద్వేలు పట్టణ, మండల కార్యవర్గం సమావేశంలో వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక అభివృద్ధి, ఐక్యత, సేవ, ప్రేమ గుణాలతో జీవిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శామ్యూల్, ఆయా మండలాల అధ్యక్షులు జి.విజయకుమార్, భాస్కర్, మస్తాన్‌వలి, మాథ్యూస్, వందనం, జీవన్‌కుమార్, రాజారత్నం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీ జెంట్రీల్యాబ్స్ వారు బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఏఐ/ఎంఎల్ ఇంజినీర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో హెప్సీబా, తేజశ్రీ, గురుజ్యోత్స్న, మహమ్మద్ జాఫర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రతి కార్యకర్తకు మేలు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఇకపై పార్టీ కార్యకర్తలకు తప్పకుండా మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో పరిధిలోని రెండో వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వార్డు కమిటీల ఏర్పాటు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోలా కాకుండా పార్టీ తప్పక ప్రతి కార్యకర్తను గుర్తించే పనిలో ఉందన్నారు. కమిటీల ఏర్పాటు పూర్తయిన తర్వాత జనవరిలో ఐడీ కార్డులు ఇస్తారని, ప్రతి కార్యకర్త వివరాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాష్ బోర్డులో ఉంటాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరిగాయని, ఈ ప్రభుత్వం వచ్చాక తాము మంజూరు చేసిన పనులను పూర్తి చేయలేని దుస్థితిలో ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రెండో వార్డు ప్రజలకు రూ.40 కోట్లు నగదు వచ్చిందని, మరో రూ.2కోట్లతో రెండో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.42 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కారం తాగునీటి పైపులైన్ నిర్మించామని, దోబిఖానా నిర్మించామన్నారు. ప్రతి వార్డులో 150 మందితో వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జి ద్వార్శల గురునాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, గుర్రం లావణ్య, జయంతి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మాజీ కౌన్సిలర్ పిట్టా భద్రమ్మ పాల్గొన్నారు.

పేదల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిచిపోయి పేదలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్యసేవలు పునరుద్ధరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రూ.3 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని కోరుతూ మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించే ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, బాబు, చంద్రపాల్, నారాయణ, శివరామ్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన నోడల్ అధికారి



రైతులతో మాట్లాడుతున్న రీసర్వే నోడల్ అధికారి శ్రీనివాసులరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మండలంలో నిర్వహిస్తున్న రీ సర్వే ఫేజ్–3ని మంగళవారం సీఎస్‌ఓ డిప్యూటీ డైరెక్టర్, రీ సర్వే జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. మండలంలోని శివపురం రెవెన్యూ గ్రామంలో ఆయన రీ సర్వే గురించి నేరుగా రైతులతో మాట్లాడారు. రీ సర్వే జరుగుతున్న సమాచారాన్ని స్థానిక అధికారులు వారికి ఏవిధంగా తెలిపారనే విషయంపై ఆరా తీశారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, రీ సర్వేపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీ సర్వే జిల్లా అధికారి మురళీకృష్ణ, డివిజనల్ సర్వేయర్ టి.రఘురామయ్య, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.ప్రవీణ్‌కుమార్, మండల సర్వేయర్ ఎస్.కరిముల్లా, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.ఓబులేసు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయండి



నిరసన తెలుపుతున్న ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు

బద్వేలు అర్బన్ : విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా నాయకులు ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మైదుకూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేసేవరకు, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్ ఇంప్లిమెంట్ చేసి గ్రేడ్–2 కార్మికులకు న్యాయం చేసేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, తిరుపాల్, శంకర్‌రెడ్డి, యూఈఈయూ డిస్కమ్ నాయకులు నాగరాజు, సుబ్బారావు, గోపాల్, పవర్ జేఏసీ నాయకులు జయరామిరెడ్డి, మల్లికార్జున, రమేష్, మోహన్, పి.వి.రమణ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట.. వర్షార్పణం!



రాజుపాళెం: టంగుటూరు గ్రామ పరిధిలో మొక్కజొన్న విత్తనాలపై వర్షం పడుతున్న దృశ్యం



తడిచిన మొక్క జొన్న విత్తనాలను ఆరబెట్టుకుంటున్న రైతులు

ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన అన్నదాతకు అన్నీ కష్టాలు.. నష్టాలే. గత కొన్ని రోజులుగా టంగుటూరు, కానగూడూరు, జిల్లెల్ల తదితర గ్రామాల్లో ముమ్మరంగా మొక్కజొన్న పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. నూర్పిడి అనంతరం విత్తనాలను రెండు రోజులపాటు ఆరబెట్టిన తర్వాత విక్రయించాల్సి ఉంటుంది. అయితే ఆరబెట్టే క్రమంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా వర్షాలు పడటంతో మొక్కజొన్న విత్తనాలన్నీ వర్షార్పణం అవుతున్నాయి. దీంతో విత్తనాలు నల్లగా మారడంతో వ్యాపారులు రూ.200 నుంచి రూ.400 వరకు తక్కువగా అడుగుతుండటంతో రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు కాగా క్వింటా మొక్కజొన్నలు రూ.2000 ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు.

– రాజుపాళెం